
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం। 3। సెప్టెంబర్। 2024



సోమశిలలో 38.872 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 38.872 టీఎంసీలు ఉన్నాయి. 22,950 క్యూసెక్కుల వరద వస్తుండగా పెన్నార్ డెల్టాకు 700, కావలి కాలువకు 350, ఉత్తరకాలువకు 5, దక్షిణకాలువకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.73,760
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,681
3 శాతం జీఎస్టీతో	రూ.6,881
నవర (8 గ్రా)	రూ.55,048

గరిష్ఠం/కనిష్ఠం
35.9 /26.0

వాతావరణం

గాలిలో తేమ 54 శాతంగా సోమవారం నమోదైంది. జిల్లాలో వాతావరణం మంగళవారం మబ్బులతో ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

వర్షాలు, వరదలు వస్తాయి

- దీటుగా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి
- కలెక్టర్ ఆనంద్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో భారీ వర్షాలు, వరదలు సంభవిస్తే దీటుగా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్ నుంచి సబ్‌కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇతర జిల్లాల్లో సంభవించిన వరదలను దృష్టిలో పెట్టుకుని, జిల్లాలో బలహీనంగా ఉన్న చెరువులు, కాలువ కట్టలకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. జిల్లాలో ఏదైనా ఇబ్బందులు సంభవిస్తే వెంటనే సంబంధిత మండల తహసీల్దార్లు జిల్లా కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూంకు తెలియజేయాలన్నారు. అందరూ అధికారులు క్రియాశీలకంగా పనిచేస్తూ ఎక్కడా మానవ నష్టం సంభవించకుండా చూడాలన్నారు. తహసీల్దారు, ఇరిగేషన్ ఏఈ, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ లవన్న, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డ్వామా పీడీ శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, హౌసింగ్ పీడీ దయాకర్, ఐటీడీఏ పీఓ పరిమళ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గుండె చప్పుడులో రాజన్న

- వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి
- విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ ఎంపీ మేకపాటి, మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, విజయడెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (బారకాసు): 'డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఐదేళ్ల ఐదు నెలలే అయినా.. ఐదు తరాలు మరిచిపోలేని అభివృద్ధికి బాటలు, సంక్షేమానికి బీజాలు వేశారు. ప్రతి మదిలో రాజన్న చెరగని ముద్ర వేశారు. ఆయన భౌతికంగా దూరమై పదిహేనేళ్లు గడిచినా.. ప్రజలు తమ జీవితాల్లో తీసుకొచ్చిన గొప్ప మార్పును స్మరించుకుంటున్నారు. పాలనలో, ప్రగతిలో తెచ్చిన సంస్కరణలు నేటి పాలకులకు ఆచరణీయంగా మారాయి.' అని పలువురు వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సర్వమత ప్రార్థనలు జరిపారు. ఆయన అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు.

రాజన్న పాలనే మార్గదర్శకం

రాజకీయాల్లో ప్రజాపాలకులుగా ఉండాలంటే ఎవరైనా సరే దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని మార్గదర్శకంగా తీసుకోవాలని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్న మేకపాటి మాట్లాడారు. దేశంలో ఎవరూ ఊహించని విధంగా, ఏ ముఖ్యమంత్రి అమలు చేయనటువంటి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 82 సాగునీటి ప్రాజెక్ట్‌లు, 104, 108 వంటి మహోన్నతమైన కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. రెండో సారి ముఖ్యమంత్రి అయిన తర్వాత డాక్టర్ వైఎస్సార్ తనకు ఎందుకు తక్కువ సీట్లు వచ్చాయనే విషయాన్ని ప్రజల్లోకి వెళ్లి తెలుసుకునేందుకు రచ్చబండ కార్యక్రమాన్ని తలపెట్టారన్నారు. అందులో భాగంగానే ఉదయగిరి నియోజకవర్గంలో దుత్తలూరు మండలంలోని ఓ చిన్న గ్రామానికి రావాల్సి ఉందన్నారు. ఆ క్రమంలోనే దురదృష్టవశాత్తు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందేనన్నారు. చిన్న నాయకుల దగ్గర నుంచి పెద్ద నేతల వరకు అందరూ వైఎస్సార్ మార్గంలో నడచినట్లయితే తప్పనిసరిగా మనందరం విజయవంతమవుతామన్నారు. ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉజ్వల భవిష్యత్ ఉందని, మరో 30 ఏళ్లు రాజకీయ జీవితం ఉంటుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలంతా ధైర్యంగా ఉండాలని కోరారు.

వైఎస్సార్ పాలన స్వర్ణయుగం

రాష్ట్రంలో అభివృద్ధికి విధాత, సంక్షేమ పథకాల ప్రదాత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో వైఎస్సార్ పరిపాలన స్వర్ణయుగమన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం ప్రధాన రంగాలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్ట్‌లకు ఇలా ఎన్నో కార్యక్రమాలకు నాంది పలికారన్నారు. సంగం, నెల్లూరు బ్యారేజీలతో కొత్త యుగానికి వైఎస్సార్ శ్రీకారం చుట్టారన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం వాటిని పూర్తి చేసిన దాఖలాలు లేవన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన చొరవ తీసుకుని సంగం, నెల్లూరు బ్యారేజీలను ప్రాజెక్ట్‌లను పూర్తి చేసి ప్రజానీకానికి అంకితం చేశారన్నారు. ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న నేతల పేర్లు రెండు బ్యారేజీలకు పెడితే ఈ రోజు చంద్రబాబు ఆ పేర్లను తొలగించే ఘనకార్యం తప్ప పురోగతి గానీ అభివృద్ధి గానీ లేదన్నారు. విలువలు, విశ్వసనీయతకు పెద్దపీట వేసిన మహానేత డాక్టర్ వైఎస్సార్ అని, జిల్లా అభివృద్ధిలో అడుగడుగునా ఆ మహనీయుడు కనిపిస్తున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అదే పంథాలో కొనసాగుతూ ఈ రోజు ఓటమికైనా సిద్ధపడ్డాడే తప్ప తప్పుడు హామీలిచ్చి ప్రజల్ని మోసం చేయడానికి సిద్ధపడలేదన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్‌పై ఉన్న ప్రేమతో ఆయనకు నివాళులర్పించడానికి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు రావడం చూస్తుంటే ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ ఉందన్నారు. వైఎస్సార్ మరణించి పదిహేనేళ్లు అయినా.. ఇంకా ప్రతి ఒక్కరూ ఆయన్ను స్మరించుకోవడం చూస్తే.. బతికితే వైఎస్సార్‌లా బతకాలనిపిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో, మండలాల్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పేదలకు వస్త్రదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, విజయడెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, పార్టీ నేతలు అంజాహుస్సేనీ, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, స్వరాజ్, సిద్ధిక్, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట శేషయ్యతో పాటు పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



పేద మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆనం అరుణమ్మ తదితరులు



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు తదితరులు

చంద్రబాబు పాలనలో రాష్ట్రం భ్రష్టు

- రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం
- వీఓఏ, ఎఫ్‌ఏలను తొలగించి కడుపు కొడుతున్నారు
- ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు సోమిరెడ్డి రూ.లక్షల దండకాలు
- చిరుద్యోగుల కోసం న్యాయపోరాటం చేస్తాం
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ మంత్రి కాకాణి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి

నెల్లూరు (దర్గామిట్ట): చంద్రబాబు పాలనలో రాష్ట్రం భ్రష్టుపట్టి పోతోందని, రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన కలెక్టర్ ఆనంద్‌కు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాకాణి విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తారని హామీ ఇచ్చారన్నారు. ఈ రోజు వారి ఉద్యోగాలే డోలాయమానంలో ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా పొదుపు సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలిచ్చి వారి ఆర్థిక అభివృద్ధికి దోహదపడే విధంగా సేవలందించే వీఓఏల కడుపుకొట్టే విధంగా బలవంతంగా తొలగిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లను సైతం తొలగించారన్నారు. కష్టపడి పనిచేసే పేదలైన చిరుద్యోగుల కడుపుకొట్టాలని చూస్తున్నారని, ఆ ప్రయత్నం విరమించుకోవాలన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఏ అధికారం లేకపోయినా ఆయన ఉత్తర్వులను అధికారులు అమలు చేస్తున్నారన్నారు. దళితుల వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు రూ.3 లక్షలు సోమిరెడ్డి అడిగారన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగిస్తున్నారన్నారు. బలవంతంగా ఉద్యోగులను తొలగించే ప్రయత్నం మానుకోవాలని, లేకపోతే న్యాయపోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో మద్యం దుకాణాల్లో వేలాది మంది ఉద్యోగులు ఉన్నారని, కొత్త మద్యం పాలసీ ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. ప్రస్తుతం మద్యం షాపుల్లో పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రతపై వారికి ప్రత్యామ్నాయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. చిరుద్యోగుల కడుపు కొట్టాలని చూస్తే వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రతినిధుల సమన్వయంతో న్యాయపోరాటం చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై అరాచక మూక దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సూరిబాబును పరామర్శిస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి



సూరిబాబును పరామర్శిస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు(క్రైమ్): వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిపై కొందరు గుర్తుతెలియని అరాచక మూకలు దాడిచేసి గాయపరిచాయి. ఈ ఘటన గాంధీనగర్ వినాయకుగుడి వద్ద సోమవారం జరిగింది. మహాత్మాగాంధీనగర్‌కు చెందిన సీహెచ్ సూరిబాబు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. ఆయన సోమవారం కరెంటాఫీసు సెంటర్‌లో జరిగిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని తిరిగి తన కారులో ఇంటికి బయలుదేరారు. ఐదుగురు వ్యక్తులు బైక్‌ల్లో అతన్ని వెంబడించారు. గాంధీనగర్ వినాయక గుడి వద్దకు వచ్చే సరికి నిందితులు బైక్‌తో కారును ఢీకొట్టి సూరిబాబుతో గొడవకు దిగారు. ఆయనపై దాడిచేసి నిందితులు పరారయ్యారు. గాయపడిన సూరిబాబును స్థానికులు నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు జీజీహెచ్‌కు చేరుకుని సూరిబాబును పరామర్శించారు. అతన్ని మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైకు తరలించారు. నిందితుల్లో ఒకరు రౌడీషీటర్ ముఖ్య అనుచరుడు మహేష్ అని తేలింది. మిగిలిన వారు ఎవరనే వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు విచారిస్తున్నారు.